క్లుప్తంగా

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



పారిశుధ్య సిబ్బందికి దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

తాళ్లరేవు: మండల పరిధిలోని గాడిమొగ, సుంకరపాలెం పంచాయతీలలో పారిశుద్ధ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. గాడిమొగ పంచాయతీలో పారిశుధ్య సిబ్బంది, తాగునీటి సరఫరా వర్కర్లు, సచివాలయ సిబ్బందికి ఒక జత యూనిఫాం, జత దుస్తులను సర్పంచ్ కామాడి గోవలక్ష్మి అందజేశారు. గ్రామ ఉపసర్పంచ్ కొక్కిలిగడ్డ లోకేష్, నాయకులు కామాడి మాతరాజు, వనమాడి నూకరాజు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. అలాగే సుంకరపాలెం పంచాయతీలో సుమారు 80 మంది వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులకు స్థానిక సర్పంచ్, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు టిళ్లపూడి నాగేశ్వరరావు అందజేశారు.

పశువులకు లంపీ వ్యాక్సిన్లు

అల్లవరం: కొమరగిరిపట్నంలో లంపీ స్కిన్ వైరస్ నిర్మూలనకు పశువైద్యాధికారి సీహెచ్ నారాయణరావు ఆధ్వర్యంలో శుక్రవారం పశువులకు వ్యాక్సిన్లు వేశారు. కొమరగిరిపట్నం పశువుల ఆస్పత్రిలో శుక్రవారం జరిగిన పశు వైద్య శిబిరంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు మాట్లాడుతూ గ్రామంలో పూర్తి స్థాయిలో పశువుల వైద్యాధికారిని ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బోడసకుర్రులో ప్రత్యేక పారిశుధ్య పనులు

అల్లవరం: సంక్రాంతి నేపథ్యంలో బోడసకుర్రు పంచాయతీ పరిధిలో రెండు రోజుల పాటు ప్రత్యేక శానిటేషన్ నిర్వహించామని సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి తెలిపారు. గ్రామంలోని విధులు, ఇంటింటికీ బ్లీచింగ్‌తో శానిటేషన్ చేశామన్నారు. కార్యదర్శి దుర్గా శ్రీనివాస్, రొక్కాల నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది. వలంటీర్లు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు చేయించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేషగిరిరావు

అల్లవరం: దాళ్వాలో వరి వేస్తున్న రైతులందరూ ఈ-పంట నమోదు చేయించుకోవాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఉండ్రు సుదర్శనరావు అధ్యక్షతన శుక్రవారం స్థానిక ఆర్బీకేలో వ్యవసాయ సలహామండలి సమావేశం నిర్వహించారు. దాళ్వా సీజన్‌కు పూర్తి స్థాయిలో సాగునీరు అందిస్తామని ఎంపీపీ తెలిపారు. వ్యవసాయాధికారి ఎన్‌వీవీ సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 3 వేల ఎకరాల్లో నాట్లు వేయగా 2200 ఎకరాల్లో ఈ-పంట నమోదు చేశామన్నారు. ఈ నెల 25 నాటికి వరినాట్లు పూర్తవుతాయని ఏఓ తెలిపారు. తహసీల్దార్ సాంబశివప్రసాదు, వ్యవసాయ సలహామండలి సభ్యులు పాల్గొన్నారు.

జోన్స్‌కు ఘనంగా నివాళులు



జోన్స్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సుమన్ వర్మ

అమలాపురం రూరల్: ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ జయంతిని క్లబ్ అధ్యక్షుడు జంపన సుమన్ వర్మ ఆధ్వర్యంలో నిర్వహించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంధుల పాఠశాలలో 25 కేజీల బియ్యం బస్తా, రూ.2500 నగదు అందించారు. క్లబ్ కార్యదర్శి కాండ్రేగుల మల్లేశ్వరరావు, కోశాధికారి పంపన సూర్యతేజ, జోన్ చైర్మన్ బూరగాయల శివ రామకృష్ణ, యర్రమిల్లి విశ్వేశ్వరరావు, రీజియన్ చైర్మన్ ఎంవీఎస్ఎస్ పూర్ణిమ లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు



ఎన్.కొత్తపల్లిలో కోడిపందేల నిర్వాహకులతో మాట్లాడుతున్న తహసీల్దార్

ఉప్పలగుప్తం: సంక్రాంతి పేరుతో కోడి పందేలు, జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరి అన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో కోడిపందేలు నిర్వహించే ప్రదేశాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఏఎస్సై వై.సత్యనారామణ, ఆర్ఐ ఎంవీ రమణ, వీఆర్వోలు తహసీల్దార్ వెంట ఉన్నారు.



మురమళ్లలో ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబరాల్లో చిన్నారుల సందడి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న వెంకటేశ్వర డిగ్రీ కళాశాల యాజమాన్య ప్రతినిధులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జిల్లా ఆర్య వైశ్య అధ్యక్షుడు బాబీ, సీతామహాలక్ష్మి తదితరులు



నానిరాజును సత్కరిస్తున్న కవులు, రచయితలు



సోల్జర్స్ జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ప్రతినిధులు

పల్లెలకు పెద్దపండగ

- భోగితో సంక్రాంతికి స్వాగతం
- రంగవల్లులతో ముంగిళ్లు ముస్తాబు
- ఇంటింటా సందడి చేస్తున్న అతిథులు
- అంబరాన సంబరాలు

సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలికేందుకు పల్లెలు సిద్ధమవుతున్నాయి. ప్రజ్వలమైన భోగి మంటలతో పెద్ద పండగకు స్వాగతం పలుకుతున్నారు పల్లెప్రజలు. గతేడాది నిస్తేజంగా గడచిన పండగ ఈ ఏడాది మాత్రం ఎక్కడ చూసినా నూతన శోభను సంతరించుకుంది. పిల్లా.. జెల్లా, పెద్దా.. పడుచూ అంతా కలసి గోమయంతో చేసిన పిడకలను దండగా గుచ్చి భోగి మంటలో వేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. భోగిరోజు సాయంత్రానికి చిన్నారులకు భోగిపళ్లు వేయడానికి ఏర్పాట్లు చేసుకుని బంధువులను వాయినాలకు పిలుచుకున్నారు. అలాగే ధనుర్మాసం సందర్భంగా గోదా కళ్యాణాలు నిర్వహించేందుకు ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు. – ముమ్మిడివరం



సంక్రాంతి ముగ్గులో గొబ్బెమ్మల చుట్టూ తిరుగుతూ కోలాటం ఆడుతున్న యువతులు (ఫైల్)

ఐ.పోలవరం: మురమళ్లలో క్షత్రియ పరిషత్ ఆధ్వర్యంలో హైస్కూల్ సమీపంలో కొబ్బరి తోటలో ముగ్గుల పోటీలు, చిన్నారుల ఆటా పాటలతో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రామంలో ఇళ్లకు వచ్చిన బంధువులు, స్థానికులు పెద్ద ఎత్తున చేరుకోవడంతో సంబరాలు అంబరాన్ని తాకాయి. పెద్ద ఎత్తున షామియానాలు, మైక్ సిస్టమ్, ఏర్పాటు చేసి అందరూ కలసి సహపంక్తి భోజనాలు చేశారు.

ఆర్య వైశ్య మహిళా విభాగ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

అమలాపురం టౌన్: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్య వైశ్య మహిళా విభాగ్ ఆధ్వర్యంలో స్థానిక కాపు కళ్యాణ మండపంలో రంగోలి పోటీలు శుక్రవారం నిర్వహించారు. విభాగ్ అధ్యక్షురాలు యెండూరి సీతామహాలక్ష్మి పర్యవేక్షణలో జిల్లా ఆర్య వైశ్య అధ్యక్షుడు కంచర్ల బాబీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వంద మంది మహిళలు పాల్గొనగా మొదట మూడుస్థానాలు సాధించిన ఎం.నాగలక్ష్మి, అమృతశ్రీ, జి.హేమలకు బహుమతులు అందజేశారు. సంతూర్ సోప్స్ విజయ లక్ష్మి ఏజెన్సీస్ సహకారంలో ఈ కార్యక్రమం జరిగింది.

మెట్రోకెమ్ ఆధ్వర్యంలో నేటి నుంచి సంక్రాంతి సంబరాలు

అమలాపురం టౌన్: ఐదేళ్లుగా సొంత గడ్డపై సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న హైదరాబాద్, విశాఖపట్నం మెట్రోకెమ్ కంపెనీల అధినేత డాక్టర్ నందెపు బాలాజీ స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో ఈ ఏటా పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహిస్తున్నారు. తన స్వగృహంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. కోడి పందేలు, సంక్రాంతి సంబరాల కోసం ప్రత్యేక సెట్టింగులు వేసినట్టు తెలిపారు. సంక్రాంతి నాడు కోనసీమ స్థాయి ముగ్గుల పోటీలు, కనుమ రోజు 10 ప్రభలతో ప్రభల తీర్థం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో అమలాపురాన్ని సంక్రాంతి సంబరాలకు చిరునామాగా చేసి ఏటా ఈ సంబరాల స్థాయిని పెంచుకుంటూ సాగుతామని డాక్టర్ బాలాజీ తెలిపారు.

ఉత్సాహంగా సాహితీ సంక్రాంతి..

అమలాపురం టౌన్: స్థానిక కూచిమంచివారి అగ్రహారంలో శుక్రవారం సంక్రాంతి సాహిత్య సభ, సాహితీ హేమంతం, కవిసమ్మేళనం నిర్వహించారు. శ్రీశ్రీ కళావేదిక, కోనసీమ రచయితల సంఘం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి కోనసీమ రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రచయితల సంఘం అధ్యక్షుడు, కవి బీవీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమాల్లో శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు, కవి నల్లా నరసింహమూర్తి సంక్రాంతి విశిష్టతపై చర్చించారు. అనంతరం కవితా గానాలు చేశారు. హేమంత సత్కారాల్లో భాగంగా నానిరాజు, రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక యూనియన్ అధ్యక్షుడు గళ్లా రాములను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సినీ నటుడు గుర్రం రామకృష్ణారావు, మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు త్సల్లా బిందు మాధవరావు, కవులు, రచయితలు పాల్గొన్నారు.

వెంకటేశ్వర కళాశాలలో..

స్థానిక శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో సంప్రదాయబద్ధంగా పోటీలు నిర్వహించారు. విజేతలకు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కేవీఆర్ఎస్ నరసింహారావు, ప్రిన్సిపాల్ కె.మనోహర్ బహుమతులు అందజేశారు.

క్రికెట్ టోర్నీ విజేత సోల్జర్స్ జట్టు

యానాం: సంక్రాంతిని పురస్కరించుకుని మూడు రోజుల పాటు స్థానిక మెట్టకూరు ప్రభుత్వ హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన క్రికెట్ టోర్నీలో సోల్జర్‌టీమ్ విజయం సాధించి ట్రోఫీని అందుకుంది. యానాం, పరిసర ప్రాంతాలనుంచి మొత్తం 8 జట్లు పాల్గొనగా ఫైనల్స్‌కు సోల్జర్ టీమ్ జట్టు కనకాలపేట జట్లు చేరుకున్నాయి. శుక్రవారం జరిగిన ఫైనల్స్‌లో సోల్జర్‌టీమ్ విజయం సాధించింది. విన్నర్, రన్నర్ జట్లుకు కాటంశెట్టి రామ్మూర్తి, కాపగంటి శేషసుమన్, రేవు రేవతి, రెయ్యా రాజు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షుడు దత్తు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

తాళ్లరేవు: మండల పరిధిలోని పి.మల్లవరంలో సంక్రాంతి సందర్భంగా కబడ్డీ, వాలీబాల్, రంగవల్లుల పోటీలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం డే అండ్ నైట్ కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఫ్లడ్ లైట్లలో స్థానిక ముత్యాలమ్మ ఆలయం ఎదుట మహిళా కబడ్డీ పోటీలు, అనంతరం పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహించారు. మహిళా కబడ్డీ పోటీల ప్రారంభ మ్యాచ్ రామన్నపాలెం, భైరవపాలెం జట్ల మధ్య జరగ్గా రామన్నపాలెం విజేతగా నిలిచింది. తాళ్లరేవు, సుంకటరేవు జట్ల మధ్య జరిగిన పురుషుల కబడ్డీ పోటీలో తాళ్లరేవు గెలుపొందింది. ఈ పోటీల్లో గెలిచిన వారికి నగదు బహుమతితో పాటు ట్రోఫీలను అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



పి.మల్లవరంలో రామన్నపాలెం, భైరవపాలెం మహిళా కబడ్డీ జట్లతో నిర్వాహకులు

గోపిడకలు కిలో రూ.30



తోపుడు బండిపై విక్రయానికి ఉంచిన పిడకల దండలు

యానాం: గ్రామాల్లో చిన్నారులు ఆవుల పేడతో పిడకలు తయారుచేసి భోగి మంటల్లో వేస్తుంటారు. అయితే పట్టణంలో గోపిడకలు తయారుచేసుకునే వారు లేకపోవడంతో గ్రామాల నుంచి తెచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. శుక్రవారం తోపుడుబళ్లు, ఆటోలపై కేజీ రూ.30 చొప్పున విక్రయించారు. ఇప్పటికే గోపిడకలను ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్న సంగతి తెలిసిందే. కాలం మారుతోంది, సంప్రదాయాలు కనుమరుగవుతున్నాయనే దానికి గోపిడకలు విక్రయాలు ఉదాహరణగా నిలుస్తాయని అంటున్నారు.

కర్మయోగి పంచముఖి

- గురువుకు బిరుదు ప్రదానం.. స్వర్ణ కంకణ ధారణ
- 50 ఏళ్లుగా చదువు నేర్పిన, నేరుస్తున్న విద్యార్థుల సత్కారం



సుబ్రహ్మణ్య పంచముఖి మాస్టారుకు పాదపూజ చేస్తున్న పూర్వపు, ప్రస్తుత విద్యార్థులు

అమలాపురం రూరల్: తమకు పాఠాలు చెప్పిన, నేటికీ చెప్పున్న పూర్వపు, ప్రస్తుత విద్యార్థులు తమ గురువుకు అరుదైన సత్కారం, బహుమానం, గౌరవం ఇచ్చారు. స్థానిక కొంకాపల్లికి చెందిన తాతా సుబ్రహ్మణ్య పంచముఖి 1973 నుంచి నేటి వరకూ ఇంటి వద్ద ట్యూషన్ చెబుతూ ఎందరినో తీర్చిదిద్దుతున్నారు. ప్రస్తుతం స్థానిక ఏఎస్ఎన్ కళాశాలలో నేటికీ ఆయన అధ్యాపకుడిగా సేవలు అందిస్తున్నారు. 50 ఏళ్లుగా విద్యాబుద్ధులు నేర్పిన విద్యార్థులు పేరూరులోని కళ్యాణ మండపంలో శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా సువర్ణ కంకణ ధారణ చేశారు. కర్మ యోగి బిరుదును ప్రదానం చేసి పాద పూజ చేశారు. వేద పండితుల ఆశీర్వచనాలతో గురుపూజ చేశారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ సభ్యుడు పేరి కామేశ్వరరావు (పీకే రావు) ముఖ్య అతిథిగా పాల్గొని ఈ సత్కారం అరుదైనదని అభిప్రాయపడ్డారు. ఏఎస్ఎన్ కళాశాల కార్యదర్శి ఏడిద నళినీకుమార్ కూడా మాట్లాడారు. పంచముఖి మాస్టారు మాట్లాడుతూ తన వద్ద చదువుకున్న విద్యార్థులంతా నేడు పలు రంగాల్లో స్థిర పడి సంతోషంగా జీవిస్తున్నందుకు తన ఆనందాన్ని, ఉద్వేగాన్ని వ్యక్తం చేశారు.

ఆక్వారంగాన్ని కాపాడుకోవాలి

అమలాపురం రూరల్: సంక్షోభంలో ఉన్న ఆక్వా రంగాన్ని కాపాడుకోవాలంటే దేశీయంగా ఉత్పత్తి అవుతున్న రొయ్యలను మనం తిని ఆక్వా రంగాన్ని పోత్సహించాలని ఆక్వా రైతు దెందుకూరి సత్యనారాయణరాజు అన్నారు. అమలాపురం భూపయ్య అగ్రహారంలోని ఆయన నివాసంలో ఆక్వా రంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై విలేకరుల సమావేశం నిర్వహించి రొయ్యలు తినడం ఆరోగ్యానికి మేలు అని నివేదికలు వెల్లడించాయని ఆయన తెలిపారు.

ప్రవీణ్ సేవలు అభినందనీయం

అమలాపురం రూరల్: ఆంధ్రసేవారత్న ఉపాధ్యాయ జేఏసీ చైర్మన్ వైఎస్సార్ సీపీ నాయకుడు కరాటం ప్రవీణ్ సేవలు అభినందనీయమని మంత్రి పినిపే విశ్వరూప్, రాజోలు ఎమ్మెల్యే రేపాక వరప్రసాద్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. సంక్రాంతి సందర్భంగా ప్రవీణ్ రెడ్డిపల్లి, అమలాపురం, ఉప్పలగుప్తం తదితర గ్రామాల్లో వితరణలు చేశారు. ఈ మేరకు వారు ప్రవీణ్‌ను అభినందించారు. రెడ్డిపల్లిలో వెంకటేశ్వర డిగ్రీ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కేవీఆర్ నరసింహరావు, ప్రిన్సిపాల్ కరాటం మనోహర్, జేఏసీ కన్వీనర్ బండారు రామ్మోహన్ రావు తదితరులు ఆయనను సత్కరించారు.

నిత్యావసరాల అందజేత

యానాం: సంక్రాంతిని పురస్కరించుకుని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అభిమానులు పలువురు రోగులకు శుక్రవారం నిత్యావసరకిట్లను అందజేశారు. నాయకులు పెట్టా హరి, ఆకుల సత్యనారాయణ, కాళ్ల శివ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష తులసి పూజ

అంబాజీపేట: ధనుర్మాసం సందర్భంగా గంగలకుర్రులో సర్వమంగళ సమేత చెన్నమల్లేశ్వర స్వామి, రుక్మిణీ సత్యభామా సమేత మదన గోపాలస్వామి ఆలయంలో శుక్రవారం లక్ష తులసి పూజ వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన జయంతి భాస్కరసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో అర్చకులు పూజ్యం వెంకటశ్రీనివాస్, పెద్దింటి గోపాలాచార్యులు స్వామివారికి లక్షతులసి పూజతో పాటు పూజలు జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అపూర్వ సందడి

ముమ్మిడివరం: వారంతా ఎక్కడెక్కడో స్థిర పడ్డారు. ఉద్యోగ, వ్యాపార రీత్యా దూర ప్రాంతాల్లో ఉన్న వారంతా ఒక్క చోట చేరి సందడి చేశారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1989–90లో పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు శుక్రవారం నగర పంచాయతీ పరిధిలో కొబ్బరి తోటలో కలిశారు. ఒకరికొకరు కుశల ప్రశ్నలు వేసుకుంటూ నాటి రోజులకు వెళ్లిపోయారు. వారికి విద్యాబుద్ధులు చెప్పిన గురువు కోర్ల సుబ్బారావును సత్కరించారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా శాఖ 2023 క్యాలెండర్‌ను స్థానిక కాటన్ అతిథి గృహంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ శుక్రవారం ఆవిష్కరించారు. అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు బత్తుల నకుల రాజు, ప్రధాన కార్యదర్శి గోసంగి బంగార్రాజు, కోశాధికారి సాధనాల సత్యనారాయణ, అదనపు ప్రధాన కార్యదర్శి విప్పర్తి వర ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు నేరేడుమిల్లి సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి బయ్యా మోహనరావు, కార్యనిర్వాహక కార్యదర్శి గెడ్డం ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



ఐద్వా క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

ఐద్వా క్యాలెండర్ ఆవిష్కరణ

అమలాపురం రూరల్: ఆల్ ఇండియా డెమోక్రటిక్ ఉమెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రూపొందించిన క్యాలెండర్‌ను, గోదావరి పరులేకర్ రచించిన వర్లి ఆదివాసుల తిరుగుబాటు పుస్తకాన్ని శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి పి.నాగ వరలక్ష్మి సహాయ కార్యదర్శి డి.సుశీల, సహాధ్యక్షులు కె.రాఘవ, లీగల్ సెల్ అధ్యక్షురాలు పీఎస్ శిరోమణి, కార్యదర్శి పి.భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలకు మేలైన సంక్షేమం

- జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్



సభలో మాట్లాడుతున్న జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్. చిత్రంలో బోర్డు డైరెక్టర్లు

అమలాపురం టౌన్: ముస్లిం, మైనార్టీల కోసం ముఖ్యమంత్రి జగన్ మేలైన సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, వాటిని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ అన్నారు. స్థానిక 12వ వార్డులో గల మస్జిదె షియా ఇస్నా అషరి మసీదు ఆధ్వర్యంలో ఇటీవల జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్, డైరెక్టర్లకు శుక్రవారం సాయంత్రం ఘన సత్కారం జరిగింది. ఆ మసీదు అధ్యక్షుడు ఎండీ నిస్సార్ హుస్సేన్ అధ్యక్షతన అదే మసీదులో జరిగిన అభినందన సభలో జిల్లా చైర్మన్ ఖాదర్ మాట్లాడారు. జిల్లాలోని వక్ఫ్ భూముల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన తమ బోర్డు ద్వారా పాటు పడతామని ఆయన స్పష్టం చేశారు. జిల్లా బోర్డు చైర్మన్ ఖాదర్‌తో పాటు వైస్ చైర్మన్ సజ్జాద్ హుస్సేన్, డైరెక్టర్లు ఎండీ అలీషా, కర్రార్ హుస్సేన్, జాఫర్ హుస్సేన్, ఎండీ ఆశిక్ అలీ, ఎండీ యూసఫ్, షరీఫ్ ఎండీ హరున్, షేక్ ఇస్మాయిల్‌లను మసీదు పెద్దలు సత్కరించి అభినందించారు. సభలో పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని, కౌన్సిలర్ కట్టోజు సన్యాసి, మసీదు కార్యదర్శి కర్రార్ హుస్సేన్, అమీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పందెం చిన్నబోయింది

- జిల్లా విభజనతో చిన్న బరులకే పరిమితం
- దానికి తోడు పెరిగిన పోలీసుల నిఘా
- పడమటివైపు పందెగాళ్ల చూపు

ఐ.పోలవరం: కోడి పందాలకు పెట్టింది పేరు కోనసీమ. ఆ పందేలకు పేరొందింది ఐ.పోలవరం మండలం. ఈ పందాలను పోషించే ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు ఇక్కడ ఉండడంతో మూడు దశాబ్దాలుగా మురమళ్ల, కొమరగిరి, ఎదుర్లంకల్లో పందేలు అంటే ఉభయగోదావరి జిల్లాలో పందెం వేసేవారు ఇక్కడే తిష్ట వేసి మూడు రోజుల పాటు కోడి పందేలు, పేకాట, గుండాటల్లో పాల్గొంటారు. ఈ పందాల్లో కోట్ల రూపాయలు చేతులు మారుతాయి. సంక్రాంతి పండుగ వచ్చిందంటే తెలుగు రాష్ట్రాల వారు ఈ మండలంలోని మురమళ్లవైపు చూసేవారు. నాలుగేళ్లుగా ఎన్ని నిబంధనలున్నా కోడే గెలుస్తూ వస్తోంది. గతంలో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మురమళ్లలో భారీ ఏర్పాట్లు చేశారు. భారీ స్క్రీన్లు, మినీ స్టేడియంను తలపించేలా భారీ షామియానాలు, వీఐపీ గ్యాలరీలు, మూడు వేల మంది కుర్చుని చూసేలా కుర్చీలు, మిగిలిన వారు నిలబడి చూసేలా కమిటీలు ఏర్పాట్లు చేసేవారు. అంతేకాక వీఐపీ గ్యాలరీల్లో వారికి తినుబండారాల సరఫరాకూడా ఉండేది. సాదా సీదాగా పాతయింజరం, కొమరగిరి, జి.వేమవరం, ఐ.పోలవరం మొక్కతోటలో కోడి పందాలు నిర్వహించారు. మురమళ్లలో భారీగా సైకిళ్లు, మోటారు సైకిళ్లు, కార్లపై ఈ పందాలు తిలకించేందుకు, పందాలు కాసేందుకు వచ్చి వెళ్లారు. అంతేకాక మురమళ్ల కోడి పందాల్లో మహిళలూ పాల్గొనేవారు.

ఈ ఏడాది చిన్న బరులతో సరి

ఈ సంవత్సరం జిల్లాలు వేరు కావడంతో నియోజకవర్గంలో భారీ స్థాయిలో తాళ్లరేవు మండలం నీలపల్లిలో భారీ ఏర్పాట్లు చేశారు. ఇక్కడి పోలీసు అధికారులు కఠినంగా వ్యవహరించడంతో ఈ సారి పందేలు అంతంత మాత్రంగానే జరుగనున్నాయి. మండలంలో గురు, శుక్రవారాల్లో గ్రామాల్లో వేసిన బరులను పోలీసులు ధ్వంసం చేసి ట్రాక్టర్‌తో చదును చేసేశారు. ప్రతి గ్రామంలో చిన్న బరుల్లో కోడి పందేలు వేయడానికి సిద్ధమవుతున్నారు. మండలంలోని పెద్ద పందేల కోసం ఈసారి ఇతర జిల్లాల వైపు మళ్లుతున్నారు.



జి.వేమవరంలో కోడి పందేల బరులను ధ్వంసం చేసి ట్రాక్టర్‌తో తొక్కిస్తున్న పోలీసులు

పందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవు



సంక్రాంతి పేరుతో కోడి పందేలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. కోడి పందేలు, పేకాట, గుండాట వంటి అసాంఘిక కార్యక్రమాలపై నిషేధం ఉంది. అసాంఘిక చర్యలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవు. – ఎం.జానకిరామ్, సీఐ, ముమ్మిడివరం

వాలీబాల్ విజేత విశాఖ



విశాఖపట్నం జట్టుకు కప్ అందజేస్తున్న దృశ్యం

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీ పెదపేటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో విశాఖపట్నం జట్టు విజేతగా నిలిచింది. ఫ్లడ్ లైట్ల వెలుగులో ఉత్కంఠగా సాగిన ఈ పోటీలలో కాకినాడ జిల్లా పి.మల్లవరం జట్టు రెండో స్థానాన్ని సాధించింది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా యానాం మూడో స్థానం, తూర్పుగోదావరి జిల్లా జట్లు నాలుగో స్థానాన్ని దక్కించుకున్నాయి. పోటీల్లో పాల్గొన్న విజయనగరం, కృష్ణ, పశ్చిమగోదావరి జిల్లాలతో పాటు పాల్గొన్న అన్ని జట్లకు నిర్వాహకుడు కె.శివన్నారాయణ నగదు, ట్రోఫీలను అందించారు.

ఉప్పంగల మాజీ ఎంపీటీసీ ఆదిలక్ష్మి మృతి



కాదా ఆదిలక్ష్మి (ఫైల్)

తాళ్లరేవు: ఉప్పంగల మాజీ ఎంపీటీసీ సభ్యురాలు, వైఎస్సార్ సీపీ నాయకురాలు కాదా ఆదిలక్ష్మి (75) శుక్రవారం మృతి చెందారు. ఆమెకు భర్త సూర్యారావు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు కాదా శ్రీనివాస్ ప్రస్తుతం ఎంపీటీసీగా సేవలందిస్తున్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే ఆమె వైఎస్సార్ సీపీ తరఫున అత్యధిక మెజారిటీతో గెలిచి రికార్డు సృష్టించారు. 2014–19 వరకు ఎంపీటీసీగా సేవలందించారు. ఆమె మృతికి ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్, ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ఉప్పంగల సర్పంచ్ శాఖ శంకరుడు, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ దవులూరి శ్రీరామ్మూర్తి, నాయకులు సంతాపం తెలియజేశారు.